క్లుప్తంగా

మందాలమ్మ ఆలయాభివృద్ధికి విరాళం అందజేత



ఆలయాభివృద్ధికి విరాళం ఇస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ ఆలయాభివృద్ధికి అధిక సంఖ్యలో దాతలు విరాళాలు అందిస్తున్నారని ఆలయాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం వడలికి చెందిన తమ్మినీడి శాంత కుమారి కుటుంబ సభ్యులు రూ.30,116 విరాళం అందించినట్లు తెలిపారు. ఆలయం వద్ద నిత్యాన్నదాన భవన నిర్మాణంతో పాటు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

సమృద్ధిగా మంచినీటి సరఫరా



శ్రీవెంకటరమణ

నరసాపురం: ప్రస్తుత వేసవిలో పట్టణంలో అన్ని ప్రాంతాలకు సమృద్ధిగా కుళాయిల ద్వారా రెండు పూటలా మంచినీటి సరఫరా చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ చెప్పారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ శుభ్రమైన మంచి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని, నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కాలువలు వదిలే వరకూ ఏ ఇబ్బంది లేకుండా రెండు పూటలా మంచినీటి సరఫరా జరుగుతుందని చెప్పారు. ఆలం నిల్వలు పరిపడగా ఉన్నాయని వివరించారు. మంచినీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బందులున్నా ఫిర్యాదు చేయాలని సూచించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తూర్పువిప్పర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఇరగవరం: పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఇరగవరం మండలం తూర్పువిప్పర్రు ఏఎస్ఆర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం జరిగింది. పాఠశాలలో 1998–2003లో విద్యనభ్యసించిన విద్యార్థులంతా హాజరై ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల పూర్వవిద్యార్థులు పాఠశాలలో ఉత్సాహంగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని, ఒకరికొకరు క్షేమ సమాచారం తెలుసుకున్నారు. ఆ నాటి పాత విద్యార్థులను ఒకే వేదికపై కలుసుకోవడంతో ఆనాటి ఆటపాటలు, పోటాపోటీ విద్యతో పాటు పాఠశాల ఎగ్గొట్టి చూసిన సినిమాలు, గురువుల బెత్తం దెబ్బలు ఒకరికొకరు నెమరివేసుకున్నారు. తమ తల్లి తండ్రుల ఆశీస్సులు, గురువుల కృషి కారణంగానే తాము ఈరోజు మంచి స్థితిలో ఉన్నామంటూ అప్పటి గురువులను ప్రత్యేకంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఆనాటి గురువులు సత్యనారాయణ, రాజగోపాల్, అవధాని, రాహీల్, వల్లీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాటన్ జయంతి



కాటన్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: పశ్చిమడెల్టాలో నీటి ఎద్దడిని లేకుండా చేసి రైతులకు అన్నంపెట్టిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని సర్వోదయ రైతు సంఘం నాయకుడు చినిమిల్లి వీరబాబు అన్నారు. బుధవారం సర్ ఆర్థర్ కాటన్ జయంతిని కొప్పర్రు సొసైటీ ఆవరణలో నిర్వహించారు. కాటన్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రైతులు వీరబాబు, ముక్కు గణపతి తదితరులు మాట్లాడుతూ కాటన్‌ను ఇక్కడి ప్రజలు దేవుడిగా కొలుస్తారన్నారు. అనంతరం రైతుల సంక్షేమం కోసం ఆయన చేసిన త్యాగాలను, పోరాటాలను కొనియాడారు. కార్యక్రమంలో పోలిశెట్టి సత్తిబాబు, కదిలి సత్యానారాయణ, బద్ద బుజ్జి, చెల్లబోయిన శివ తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడులో..

పెంటపాడు: పశ్చిమడెల్టాలో నీటి ఎద్దడిని లేకుండా చేసి రైతులకు అన్నంపెట్టిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ అని పలువురు వక్తలు కొనియాడారు. మండలంలో పలు గ్రామాల్లో కాటన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జట్లపాలెంలో గ్రామంలోని మిడ్‌లెవిల్ కాలువగట్టున ఉన్న కాటన్ విగ్రహం వద్ద విగ్రహదాతలైన వల్లేపల్లి కుటుంబికుల ఆధ్వర్యంలో కాటన్ జయంతి వేడుకలు జరిగాయి. పెంటపాడు ఇరిగేషన్ సెక్షన్ కార్యాలయంలో కాటన్ విగ్రహనికి సెక్షన్ ఏఈ, సిబ్బంది ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సొసైటీ కార్యాలయం వద్ద ఉన్న కాటన్ విగ్రహనికి సొసైటీ అధ్యక్షుడు కళిరెడ్డి అబ్బాయి, కార్యదర్శి సత్యనారాయణమూర్తి తదితరులు నివాళులర్పించారు.

పశువుల ఎరువుతో భూసారం పెంపు

- వేసవి దుక్కుతో మేలు
- పంటలో తెగుళ్లు దూరం
- అధిక దిగుబడులు సాధించవచ్చంటున్న రైతన్నలు



భీమవరం మండలంలోని పొలంలో వేసవి దుక్కు దుక్కుతున్న రైతు

భీమవరం అర్బన్: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోవడంతో నెలలోని పోషకాల నిల్వలోసమతుల్యంలోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం, సూక్ష్మ పోషకాల నిల్వలతో దిగుబడులు తగ్గుతున్నాయి. ఈ సమస్యను అధిగమించాలంటే సేంద్రీయ పద్ధతులను పాటించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు పేర్కొంటున్నారు. భీమవరం మండలంలో యనమదుర్రు, దిరుసుమర్రు, కొమరాడ, అనాకోడేరు, చినఅమిరం, తాడేరు, బేతపూడి, గునుపూడి, తుందుర్రు, రాయలం తదితర గ్రామాల్లో సుమారు 8 వేల 200 ఎకరాలలోను వ్యవసాయం సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దాళ్వా మాసూళ్లు దాదాపు ఒబ్బిడై పోవడంతో రైతులు తమ పొలాలలోని ఎత్తు పల్లాలను చదును చేసుకునే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. అలాగే వేసవి కావడంతో రైతులు తమ పొలాలను ట్రాక్టర్ల సహాయంతో దున్నుతూ నేలను పైకి కిందికి కలయబెడుతున్నారు. ఇలా చేయడం వల్ల నేలల్లో పోషకాలు పైకి రావడంతో దిగుబడి పెరుగుతుందని రైతులు చెబుతున్నారు.

వేసవి దుక్కులతో తెగుళ్ల దూరం

వ్యవసాయ పంటలో కాండందొలుచు పురుగులు, ఆకు ముడత పురుగులు, కాండం కుళ్లు తెగులకు కారకాలైన పురుగులు గుడ్లు పొదిగి నేలల్లో ఉంచడం వల్ల తదానంతరం వచ్చే పంటలో మళ్లీ ఆ తెగులు వ్యాప్తి చెంది పంట నాశనం చేస్తాయని రైతులు చెబుతున్నారు. వేసవిలో దుక్కులు దున్నడం వల్ల ఆ తెగులు జాతికి చెందిన బీజాలు వేడికి చనిపోవడం లేదా పక్షులు తినడంతో పంట తెగులు వ్యాప్తి తక్కువగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా మొండి జాతికి చెందిన గడ్డిమొక్కలు ఇతర కలుపు మొక్కల మూలాలు ఎండదెబ్బకు ఎండిపోతాయని రైతులు చెబుతున్నారు. దీంతో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించవచ్చని రైతులు చెబుతున్నారు. అంతేకాకుండా నేల సార వంతమవుతుందని రైతులు చెబుతున్నారు. రైతులు సార్వా పంట అవగానే దాళ్వా సాగుకు వెనువెంటనే సాగు ఆరంభించడంతో భూమి సారం కోల్పోయి పంట దిగుబడి తగ్గిపోతుందని వేసవిలో దుక్కులు దున్నడం వల్ల భూమి సారవంతమవుతుందని రైతు విశ్లేషకులు చెబుతున్నారు.

పొల్లాల్లో ఎత్తుపల్లాలను సరిచేసుకుంటున్న రైతులు

సార్వా పంట సమీపించడంతో వేసవి కావడంతో పొల్లాల్లో ఎత్తు పల్లాలను సరిచేసుకుంటున్నారు. సార్వా పంటలో వరదలు, భారీ వర్షాలు రానున్న నేపథ్యంలో పొలాల గట్లను, ఎత్తు పల్లాలను సరిచేసుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

వేసవి దుక్కుల వల్ల రైతన్నకు మేలు



వేసవి దుక్కులు దున్నడం వల్ల పంటలో తెగుళ్ల వ్యాప్తి నివారించవచ్చని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ చెప్పారు. గత పంటలో ఉన్న తెగుళ్ల బీజాలు నిర్మూలించడమే కాకుండా నేల కూడా సారవంతమవుతుందన్నారు. పంటలో అధిక ధిగుబడి సాధించవచ్చన్నారు.మొండి కలుపు మొక్కలు నివారించకోవచ్చు. ఖాళీగా ఉండే సమయంలో పొలాల్లో ట్రాక్టర్‌తో దుక్కు దున్నుంచడం వల్ల కీటకాల కోసస్థ దశలో, కలుపు మొక్కల దుంపలు, వేళ్లు, శిలీంద్ర బీజా అవశేషాలు, తిరగబడి మండే సూర్య కిరణాలకు మాడిపోతాయి. తద్వారా సాగు చేసే పంటకు కలుపు, చీడ పీడ బెడద తగ్గుతుంది. అంతేకాకుండా భూమి సారవంతమై దిగుబడులు బాగా పెరుగుతాయని చెప్పారు.

నిమ్మల శ్రీనివాస్, వ్యవసాయాధికారి, భీమవరం మండలం

ఆచంటలో జోరుగా పందేలు

పెనుగొండ: ఎన్నికలు ముగియడంతో ఆచంట నియోజకవర్గంలో పందేలకు తెరతీశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా చెరుకువాడ శ్రీరంగనాథరాజు, కూటమి అభ్యర్థిగా పితాని సత్యనారాయణలు పోటీ పడ్డారు. నామినేషన్ల నాటి నుంచి ఇరు వర్గాలు హోరాహోరీగా ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిలను ప్రజలకు వివరించడంతో పాటు, సొంత ఖర్చులతో నియోజకవర్గంలో పేదలకు అండగా చేపట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ వైఎస్సార్ సీపీ ప్రచారంలో దూసుకుపోయింది. నియోజకవర్గంలో 82.80 పోలింగ్ శాతం ఉండడంతో వైఎస్సార్ సీపీకి అనుకూలంగా ఉంటుందంటూ వైఎస్సార్ సీపీ లెక్కలు వేసి విజయ ఉత్సాహంలో ఉంది. సర్వేలు మాకు అనుకూలంగా ఉన్నాయంటూ టీడీపీ నాయకులు చెప్పుకుంటున్నారు. దీంతో ఎవరి లెక్కలు వారు వేసుకుంటూ పందేలకు కాలు దువ్వుతున్నారు. గత ఎన్నికల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇదే ఉత్సాహన్ని టీడీపీ నాయకులు ప్రదర్శించి మెజార్టీలపై పందేలు కాసి చేతులు కాల్చుకున్నారు. ఆనాడు వైఎస్సార్ సీపీకి 8000లకు పైగా మెజార్టీ వస్తుందంటూ పందేలు గీటు పెట్టడంతో టీడీపీ నాయకులు ఇబ్బడి ముబ్బడిగా పందేలు కాశారు.తీరా ఫలితాల్లో 12883 ఓట్లు మెజార్టీతో వైఎస్సార్ సీపీ విజయం సాధించడంతో చిన్నా చితకా నాయకులు అందరూ ఖంగుతిని ఆర్థికంగా నష్టపోయారు. మరోసారి ఇరువర్గాలు పందేలకు సై సై అంటూ ముందుకు వస్తున్నారు. పలానా మండలం మాకు అండగా ఉందని, పలానా మండలం సమానం ఉందంటూ ఎవరి లెక్కలు వారు వేసుకుంటున్నారు. మహిళా ఓటింగ్ గుంబనంగా ఉండడంతో పోలింగ్ సరళిపైనా కూడికలు, తీసివేతలు వేస్తున్నారు. అయితే, ఇప్పటికే శ్రీరంగనాథరాజు విజయం తనదేనంటూ కార్యకర్తలకు, నాయకులు ఆత్మీయ విందు ఇవ్వడం గమనార్హం.

పడాలలో బలుసులమ్మ జాతర

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పడాల గ్రామంలో ఉన్న బలుసులమ్మ వారి జాతర మహోత్సవం బుధవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అమ్మవారిని గ్రామంలోని పూరిగుడిసె నుంచి ఆలయానికి బ్యాండ్ వాయిద్యాలు, గరగ నృత్యాలతో అంగరంగ వైభవంగా తీసుకొచ్చారు. అమ్మవారికి గ్రామ భక్తులు సాదర స్వాగతం పలికారు. 70 ఏళ్లకొకసారి జరుగుతున్న ఉత్సవాలు కావడంతో గ్రామానికి చెందిన బంధువులు, ఆడపడుచులు పుట్టినింటికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో 14 మంది ఎంపిక

పాలకొల్లు సెంట్రల్: జీల్ ఇండియా ఏర్పాటు చేసిన ప్రాంగణ ఎంపికలో 14 మంది ఛాంబర్స్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. బుధవారం కళాశాలలో జీల్ ఇండియా ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రాంగణ ఎంపికలకు 58 మంది విద్యార్థులు హాజరయ్యారని వీరిలో 14 మంది ఎంపికయ్యారన్నారు. ఎంపికైన ఒక్కొక్క విద్యార్థికి ఉద్యోగ నిర్వహణలో రూ. 22 వేలు వేతనం ఉంటుందన్నారు.ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులకు కళాశాల చైర్మన్ కారుమూరి నరసింహారావు చేతులు మీదుగా ఆఫర్ లెటర్స్‌ను అందజేశారు.

19 నుంచి 25 వరకు బ్రహ్మోత్సవాలు

- వారం రోజుల పాటు ప్రత్యేక పూజలు
- బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని జువ్వలపాలెం రోడ్డులో శ్రీపద్మావతి సమేత శ్రీవెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం నందు ఈనెల 19 తేదీ నుంచి 25 తేదీ వరకు వారం రోజుల పాటు స్వామివారి కల్యాణ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. వారం రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈమేరకు దేవస్థానం నందు బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసందర్భంగా దేవస్థానం కార్యనిర్వహణ అధికారి రుద్రరాజు గంగాశ్రీదేవి మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల వివరాలు తెలిపారు. ఈనెల 19 తేదీ స్వామివారిని, అమ్మవారిని పెండ్లి కుమారుని, పెండ్లి కుమార్తె చేయడం, శ్రీవారికి అమ్మవారికి ప్రత్యేక చందనాలంకరణ, 20 తేదీన 108 కలశాభిషేకము, హోమలు, 21 తేదీన 108 తులసి మొక్కలతో తులసి బృందార్చన, 22 తేదీన రథోత్సవము, 23 తేదీన చక్రస్నానం, 24 తేదీన ప్రత్యేక పూజలు , 25 తేదీన అఖండ అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. దేవస్థాన చైర్మన్ మంతెన రామ్‌కుమార్‌రాజు మాట్లాడుతూ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. భక్తులు బ్రహ్మోత్సవాలను తరలిరావాలని ఆయన కోరారు.



ప్రత్యేక అలంకరణలో వెంకటేశ్వరస్వామి

భీమవరంలో సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభం

భీమవరం: భీమవరం పట్టణం జువ్వలపాలెం రోడ్డులోని ఆనంద ఇన్ హోటల్లో బుధవారం సూత్ర ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహకులు మాట్లాడుతూ గురువారం కూడా ఎగ్జిబిషన్ ఉంటుందన్నారు. సూత్ర ఎగ్జిబిషన్ ఫ్యాషన్ హౌస్, ఇది ప్రీమియం ఫ్యూజన్‌ను అందిస్తుందన్నారు. ఈ ప్రదర్శనలో దుస్తులు, గౌన్లు, చీరలు, పాదరక్షలు, ఉపకరణాలు వంటి మరెన్నో విభిన్న డిజైనర్ ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నట్లు చెప్పారు. వినియోగదారుల కోసం భారతీయ మిశ్రమంతో అంతర్జాతీయ ఫ్యాషన్ మధ్య కలయికను సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. సూత్ర ఫ్యాషన్ ఎగ్జిబిషన్ దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 50 కంటే ఎక్కువ మంది ప్రదర్శనకారులతో ప్రత్యేకమైన కలెక్షన్‌ను ప్రదర్శిస్తున్నారన్నారు. సూత్ర ప్రదర్శనలో కొంతమంది డిజైనర్లు పండోర ఆర్ట్ గ్యాలరీ, సాఖ్ ప్రత్యేక దుస్తులు, బీజెడ్ సృష్టి, రివాజ్, తక్ ప్రింట్లు , నూర్ చేనేత, జై సోనీ, డ్రీం స్టూడియో, కష్వీ చేనేత, శ్రీగణేష్ బోటిక్, మహాలక్ష్ జ్యువెలర్స్, యూబీ ట్రెండ్జ్, ట్రెండ్ సెట్టింగ్ డిజైనర్లు, విమదిలీప్, గుల్దస్తా, కాశ్మీరీ ప్రత్యేక సేకరణలు ఉంటాయని వివరించారు.



భీమవరంలో ఏర్పాటుచేసిన సూత్ర ఎగ్జిబిషన్‌లో సందర్శకులు దృశ్యం

వాసవీమాతకు సామూహిక కుంకుమార్చనలు



వాసవీ మాతకు కుంకుమార్చనలు చేస్తున్న భక్తులు



వాసవీ మాత ఆలయం నుంచి జ్యోతిని తీసుకు వెళుతున్న చెన్నై ఆర్యవైశ్యులు

పెనుగొండ: ఆర్యవైశ్యుల ఇలవేల్పు వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జయంత్యుత్సవాల్లో భాగంగా సువాసినీలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. బుధవారం ఉదయం సుప్రభాత సేవ అనంతరం శ్రీనగరేశ్వర మహిషాసురమర్ధని వాసవీ కన్యకపరమేశ్వరి ఆలయంలో నగరేశ్వర స్వామికి రుద్రాభిషేకం నిర్వహించారు. మహిషాసురమర్ధనీ, వాసవీ మాతలకు కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం వందలాది మంది సువాసినీలతో సామూహిక కుంకుమార్చనలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెనుగొండ పరిసరాలకు చెందిన వందలాది మంది మహిళలు కుంకుమార్చనల్లో పాల్గొన్నారు. సాయంత్రం వాసవీ గీత మహిళా సమాజం ఆధ్వర్యంలో వాసవీ పురాణ పఠనం చేశారు.

చెన్నైకు వాసవీ జ్యోతి

మూలవిరాట్ వాసవీ మాత ఆలయం నుంచి చెన్నై ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జ్యోతిని తీసుకు వెళ్లారు. ఉదయం నుంచి పూజలు, అభిషేకాలు అనంతరం వాసవీ భక్తులు జ్యోతిని తీసుకు వెళ్లారు. కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు చైర్మన్ నూలి తాతాజీ, వాసవీ క్లబ్ అంతర్జాతీయ మాజీ అధ్యక్షుడు నూలి రమణ మూర్తి పాల్గొన్నారు.

నేడు లక్ష కుంకుమార్చన

వాసవీ మాత జయంత్యుత్సవాల్లో భాగంగా గురువారం వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నారు. ఉదయం అభిషేకాలు, అర్చనలు అనంతరం వాసవీ మాతకు లక్ష కుంకుమార్చన నిర్వహిస్తారు. వాసవీ యువజన సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పసుపు, కుంకుమ, గాజులు పంపిణీ చేయనున్నారు.

అమృత్ సరోవర్‌లో చెరువుల అభివృద్ధి



మొగల్తూరులో అమృత్ సరోవర్‌లో చెరువును తవ్వుతున్న ఉపాధి కూలీలు

మొగల్తూరు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా చేపట్టిన అమృత్ సరోవర్ కార్యక్రమంలో గ్రామాల్లోని చెరువులను అభివృద్ధి చేసే పనులు చేపట్టారు. గతేదాది మండలంలోని మొగల్తూరు, రామన్నపాలెం, శేరేపాలెం, వారతిప్ప, పేరుపాలెం నార్త్ గ్రామాల్లోని 5 చెరువులను రూ.12.62 లక్షలతో తవ్వారు. అయితే రెండో ఏడాది కూడా చెరువులు తవ్వాలని ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇప్పటికే చెరువులో పేరుకుపోయిన మట్టిని తొలగించడం, మరోసారి గట్లు పటిష్టం చేయడం, చెరువు చుట్టూ ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, మొక్కలు నాటడం , వాకింగ్ ట్రాక్‌కు మరమ్మతులు చేయడం తదితర పనులు చేపడతారు. అంతే కాక వర్షాకాలం ముందు, తరువాత నీటి నాణ్యతను పరిశీలించి అందుకనుగుణంగా తగు చర్యలు తీసుకుంటారు.

ఉపాధి హామీ జాబ్ కార్డులు	8005
యాక్టివ్‌గా ఉన్న కార్డులు	6135

పంచాయతీలకు తగ్గనున్న భారం

అమృత్ సరోవర్‌లో పనులు చేపట్టడం ద్వారా పంచాయతీలకు చెరువుల అభివృద్ధి, నిర్వహణా భారం తగ్గుతుంది. మండలంలోని పంచాయతీ చెరువులు, పశువుల చెరువులు, రజకుల చెరువులు కలిపి 200 పైగానే ఉండగా చాలా చెరువులు మట్టితో పూడికపోయాయి. అమృత్ సరోవర్‌లో దశల వారీగా చెరువులను అభివృద్ధి చేయడంతో రానున్న రోజుల్లో చెరువులు జలకళను సంతరించుకుంటాయి.

ఘనంగా జాజులమ్మ జాతర



జాజులమ్మను దర్శించుకుంటున్న భక్తులు

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలోని తెలగంశెట్టి వారి మెరకలో ఉన్న జాజులమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. గ్రామదేవతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకునేందుకు ఆడపడుచులు దూర ప్రాంతాల నుంచి వచ్చారు. అమ్మవారి వార్షికోత్సవాలను పురస్కరించుకుని జాజులమ్మ ఆలయ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ప్రతీఏటా దాళ్వా పంటలు చేతికందిన అనంతరం మే నెలలో అమ్మవారి ఉత్సవాన్ని రెండు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం అమ్మవారి నిలబెట్టడం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే బుధవారం భక్తులు, తెలగంశెట్టివారి ఆడపడచులు ఆలయానికి చేరుకుని అమ్మవారికి నైవేధ్యాలను సమర్పించుకున్నారు. ఈ వార్షికోత్సవాల్లో భాగంగా 24న శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధనను నిర్వహిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

గ్రామాల్లో ఉపాధి హామీ పనుల జోరు

- రోజువారీగా 2200 మందికి ఉపాధి
- రూ.8.07 కోట్ల విలువైన 237 పనులు

పాలకొల్లు అర్బన్: మండలంలో అన్ని గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రైతులకు ఉపయోగపడే పంట బోదెలు, పంట కాలువల తవ్వకం పనులు ఉపాధి కూలీలు చేపడుతున్నారు. మండలంలో చింతపర్రు, లంకలకోడేరు, తిల్లపూడి, సగంచెరువు, పెదమామిడిపల్లి, దిగమర్రు, కొత్తపేట, ఆగర్రు, గవరపేట, వెంకటాపురం, అరట్లకట్ట గ్రామాల్లో పంట బోదెల తవ్వకం పనులు ఉపాధి కూలీలు చేస్తున్నారు. రోజువారీగా మండలంలో 2200 మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. అలాగే ఒక్కొక్క ఉపాధి కూలీకి రూ.278 వేతనం గిట్టుబాటవుతోంది. యలమంచిలి మండలంలో 450 పనులను రూ.4.89 కోట్లతో ప్రతిపాదించారు. గత రెండు నెలల్లో 150 పనులు పూర్తి చేశారు. 60 వేల పనిదినాలను కూలీలకు కల్పించారు. రూ.1.63 కోట్లు ఉపాధి కూలీలకు చెల్లించారు.



చింతపర్రులో పంట బోదె పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

కూలీలకు ప్రత్యేక ఏర్పాట్లు

ఉపాధి పనులు నిర్వహిస్తున్న గ్రామాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. చల్లని మంచినీరు, అలాగే ప్రథమ చికిత్స కోసం ప్రత్యేక కిట్టు ఏర్పాటు చేశారు. కూలీలు ఉదయం 7 గంటల నుంచి 10.30 గంటల వరకు నిర్వహిస్తున్నారు. పాలకొల్లు మండలంలోని 27 గ్రామ పంచాయతీల్లో 237 పనులను రూ.8.07 కోట్లతో ప్రతిపాదించారు. 1.67 లక్షల పనిదినాలను ప్రతిపాదించారు. గత ఏప్రిల్, మే నెలల్లో 57 వేల పని దినాలను ఉపాధి కూలీలకు కల్పించారు.



చింతపర్రులో పంట కాలువ తవ్వుతున్న ఉపాధి కూలీలు



సగంచెరువులో పంట బోదె తవ్వుతున్న దృశ్యం